క్లుప్తంగా

వైఎస్సార్ విగ్రహానికి నివాళులు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేస్తున్న ప్రసన్నకుమార్, జయమణి

సీతానగరం: ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రజాసంకల్ప పాదయాత్రకు 6 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీకమిషన్ సభ్యురాలు ఎస్.జయమణి, ఏపీటిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మండలకేంద్రంలో వైఎస్సార్ విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు సేవలందిస్తున్నారని ఈ సందర్భంగా వారు అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు రామారావు, ఎస్.వెంకటరమణ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ కేంద్రాల పరిశీలన



చిట్టెలబలో ఎన్నికల పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

పాచిపెంట: మండలంలోని చిట్టెలబ కన్నయ్య వలస, బొర్రామామిడి, తదితర గిరిశిఖర గ్రామాల్లోని పోలింగ్‌బూత్ కేంద్రాలను పార్వతీపురం - మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం పరిశీలించారు. వివిధ గ్రామాల నుంచి ఆయా పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు వచ్చే రహదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట రూరల్ సీఐ ధనుంజయరావు, ఎస్సై ఫక్రుద్దీన్ ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

పార్వతీపురంటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు రాజశేఖర్ అన్నారు. ఈ మేరకు నవంబర్ 8న రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి యువజన సంఘాలు నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కురుపాం మండల కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కు పోరాటానికి నవంబర్ 8తో 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా విద్యార్థి యువజన సంఘాలు ఈ బంద్ చేపడుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌ఓ, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ సంఘాల నాయకులు కె. రాజు, సీహెచ్ సింహాచలం, ముఖేశ్, నాగేంద్ర, పి.రవికుమార్ ఎ.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకుంటున్న సీఎంఆర్ఎఫ్



లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆదుకుంటోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని సంత-నర్సిపురం గ్రామానికి చెందిన నల్ల సింహాచలం అనే మహిళకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం లబ్ధిదారుకు అందజేశారు. సింహాచలం భర్త కొద్దిరోజుల కిందట పాముకాటుతో మృతి చెందడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. ఈ విషయాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి గోవిందరావు ఎమ్మెల్యే కళావతి దృష్టికి తీసుకురాగా.. ఆమె వెంటనే స్పందించి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించి రూ.2 లక్షలు మంజూరు చేసింది. ఆ చెక్కును గ్రామస్తుల సమక్షంలో లబ్ధిదారుకు ఎమ్మెల్యే అందజేశారు.

సమష్టి కృషితోనే మండల అభివృద్ధి

మెంటాడ: సమష్టి కృషితోనే మండల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆయన కాసేపు మాట్లాడారు. ఇప్పటివరకు మండలంలో రూ.230 కోట్లతో సంక్షేమ పథకాల అమలు, రూ.176 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం మరువలేనిదన్నారు. అంతకుముందు వ్యవసాయం, విద్యుత్, గృహనిర్మాణ,' మాతాశిశు సంక్షేమ, వెలుగు, ఉపాధి, విద్య, పశుసంవర్ధక శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్.ఈశ్వరరావు, ఎంపీడీవో త్రివిక్రమ్, తహసీల్దారు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంకల్పయాత్ర ఓ చరిత్ర

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- యాత్ర 6 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ర్యాలీ



కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే, పార్టీ శ్రేణులు

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో ప్రతిక్ష నేతగా ఉన్నప్పుడు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర దేశ చరిత్రలో ఓ మైలు రాయి అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర 6 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి వైఎస్సార్ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల జీవితాలు మెరుగుపడేలా, విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టడానికి తోడ్పడిన ప్రజాసంకల్పయాత్ర 6 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. ప్రజాసంకల్పయాత్ర ద్వారా వేలాది కిలో మీటర్లు నడిచి పేద, బడుగు ప్రజల సమస్యలను తెలుసుకుని వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలందరి మన్ననలు పొందుతున్నారని చెప్పారు.

విషం కక్కుతున్న ప్రతిపక్షాలు

ప్రభుత్వం పొందుతున్న ఆదరణను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విషం చిమ్ముతూ పక్కదారి పట్టించాలని ఎంత ప్రయత్నిస్తున్నపటికీ ప్రజలు వారిని నమ్మే పరిస్థితి లేకపోవడం వల్ల రోజుకో కొత్త వివాదానికి తెరతీస్తున్నారని మండిపడ్డారు. ఇవన్నీ పట్టించుకోకుండా ప్రజలందరికీ మంచి పరిపాలన అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. 2024 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకునేందుకు రాష్ట్ర ప్రజానీకం సిద్ధంగా ఉన్నారని, అదేవిధంగా మన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా కష్టపడి మళ్లీ మన ప్రభుత్వం వచ్చేంతవరకు విరమణ లేకుండా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి వైస్ చైర్మన్ యిండుపూరి గున్నేశ్వర రావు, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పార్వతీపురం ఎంపీపీ మజ్జి శోభారాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీలు బి.రవికుమార్, సిద్ధా జగన్నాథ రావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కౌన్సిలర్‌లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే

సామాజిక సాధికార యాత్ర విజయవంతం చేయండి

ఈనెల 10వ తేదీన నియోజకవర్గ కేంద్రంలో జరగనున్న సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి, పుట్టూరు, బొందలుప్పి, వీరభద్రపురం గ్రామాల్లో పర్యటించి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి పార్వతీపురం నాలుగు రోడ్ల కూడలి వద్ద బస్సు యాత్ర సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీ బి.రవికుమార్, పార్టీ నాయకులు మజ్జి శేఖర్, రాజారావు మాస్టారు. చందాన శివాజీ, జి.సతీష్‌కుమార్, వై. రమణమూర్తి, యాళ్ల ఈశ్వర ప్రతాప్, మండల జేఏఎస్ కన్వీనర్ బి. వాసుదేవరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణపురం వంతెన రోడ్డు పనుల ప్రారంభం



నారాయణపురం వంతెన అప్రోచ్‌రోడ్డు పనులు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బలిజిపేట: మండలంలోని నారాయణపురం వంతెనకు రెండు వైపులా బీటీ రోడ్ నిర్మాణం ప్రారంభమైంది. అప్రోచ్‌రోడ్డుకు వారు వేసే పని సోమవారం ప్రారంభించారు. బీటీరోడ్డు నిర్మాణం పూర్తయిన తరువాత వంతెన ప్రారంభోత్సవం చేయనున్నారు. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభిస్తారని ఎమ్మెల్యే జోగారావు ఈ మేరకు తెలిపారు. వంతెన నిర్మాణం పూర్తయినా అప్రోచ్‌రోడ్డుకు బీటీ పనులు జరగక ప్రారంభోత్సవం ఆలస్యమైందన్నారు. రోడ్డు పనులను జెడ్పీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు, నారాయణపురం గ్రామస్తులు పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, నారాయణపురం ఎంపీటీసీ రామకృష్ణనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతో ఫలితాలు సాధిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

- డీఎంహెచ్ఓ జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: వైద్యారోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాల్లో మంచి ఫలితాలు సాధిద్దామని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరితగతిన గర్భిణులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా మాతా శిశు సంరక్షణ సాధ్యమవుతుందన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రత్యేకంగా పర్యవేక్షించాలని చెప్పారు. రక్తహీనత నివారణ ప్రధాన లక్ష్యమని, అందుకు ఐరన్, కాల్షియం మాత్రలు నిర్దేశించిన మోతాదులో అందజేయాలని సూచించారు. పౌష్టికాహారం పూర్తిస్థాయిలో వినియోగించేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. గర్భిణులకు సకాలంలో అన్ని ఆరోగ్య తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్ రాణి, డీఐఓ డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివకుమార్, ప్రోగ్రాం అధికారి ఎం. వినోద్, డీపీహెచ్‌ఎన్‌ఓ ఉషారాణి, డీపీఓ లీలారాణి, డెమోలు సన్యాసిరావు, యోగేశ్వరరెడ్డి, సీడీపీఓలు, ఆశ నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాక్సిన్ నిల్వలపై జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు

సీతానగరం: ఆస్పత్రుల్లో వ్యాక్సిన్ నిల్వలను సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలించి జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐఓ) అధికారి డాక్టర్ టి. జగన్‌మోహనరావు కోరారు. ఈ మేరకు మండలంలోని పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. పీహెచ్‌సీలో వ్యాక్సిన్ నిల్వలు, వాటి నిర్వహణ పరిశీలించారు. వ్యాక్సిన్ స్టాక్, వినియోగాన్ని ఆన్‌లైన్‌లో పరిశీలించారు. అదేవిధంగా ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, వైద్య పరికరాలు అస్పత్రిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం ఓపీ రికార్డులు పరిశీలించి నమోదవుతున్న కేసులు, అందజేసిన చికిత్స గురించి సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జి. సూర్యనారాయణ, సూపర్‌వైజర్ వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి సద్భావన యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: తెలుగు భాష, సాహిత్యం, ఔన్నత్యంపై శతక పుస్తకాలు రచించిన చిగురుమళ్ల శ్రీనివాస్ 100 దేశాల్లో నిర్వహించే శాంతి సద్భావనా యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం, ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) పార్వతీపురం మన్యం జిల్లా సమన్వయకర్త పి.దేవానంద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 100 తెలుగు సంఘాలు సంయుక్తంగా ఏర్పాటు చేసుకున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ శాంతి సద్భావనా యాత్ర ఈనెల 9న ఆఫ్రికాలోని బోట్స్‌వానా (ఇండియన్ హైకమిషన్ ఆఫీస్)లో ప్రారంభం కానుందన్నారు. తెలుగు భాష, సాహిత్యం, దాని ఔన్నత్యం గురించి ప్రపంచ దేశాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో శ్రీనివాస్ ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, అధ్యాపకులు డి.శ్రీలక్ష్మి, ఎస్.శ్రీకాంత్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

పాచిపెంట: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సాంకేతిక సహాయకులకు సివిల్ సప్లైస్ ద్వారా ధాన్యం కొనుగోలుపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కె. తిరుపతిరావు మాట్లాడుతూ, ధాన్యాన్ని తీసుకువెళ్లే ప్రతి వాహనానికీ తప్పనిసరిగా జీపీఎస్ అమర్చాలన్నారు. సొంత వాహనాలలో ధాన్యాన్ని తరలించే రైతులు తమ వాహనాలకు జీపీఎస్‌లను అమర్చుకుని ముందుగానే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. సివిల్ సప్లైస్ సాంకేతిక శిక్షకుడు రాజశేఖర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలు, నాణ్యత ప్రమాణాల గురించి వివరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ అసిస్టెంట్ కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాలతో సేవలు చేరువ

- ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



శిఖబడిలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని శిఖబడి, అలమండలో నిర్మించిన నూతన సచివాలయ భవనాలను, అలమండలో రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ సేవల కోసం ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, దీని వల్ల సమయం, డబ్బు వృథా అయ్యేవని గుర్తుచేశారు. గ్రామ సచివాలయాల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు, పథకాలు గ్రామంలోనే అందుతున్నాయన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో శిఖబడి సర్పంచ్ కోట రమేష్, వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, జెడ్పీటీసీ శశికళ, మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, మాజీ ఎంపీటీసీ బడే మన్మథరావు, వైస్ సర్పంచ్ భార్గవనాయుడు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, నాయకులు ఆర్నిపల్లి వెంకటనాయుడు, మరడాన కిశోర్, మాజీ ఎంపీపీ గూనగంజి చంద్రయ్య, మహిళా మండలి అధ్యక్షురాలు ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

సంతకవిటి: మండలంలోని సురవరం గ్రామంలో కొత్తగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యమే లక్ష్యంగా రూ.22 లక్షలతో నిర్మించిన ఈ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. గతంలో అనారోగ్యం పాలైనపుడు వైద్యం కోసం మండల కేంద్రానికి ప్రజలు పరుగులు తీయాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు గ్రామాల్లోనే వైద్యారోగ్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఒకప్పుడు మండలానికి ఒకటో.. రెండో ఆరోగ్య కేంద్రాలు ఉండేవని, అందులో కూడా పూర్తిస్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బంది ఉండేవారు కాదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్లాది రూపాయలతో ఆస్పత్రులను నిర్మించడమే కాకుండా, గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ జి.షణ్ముఖరావు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై కేసులు ఎత్తివేయాలి



బలిజిపేటలో నిరసన నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బలిజిపేట: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి మద్దతు పలుకుతున్న న్యూస్‌క్లిక్ పత్రిక, మీడియాపై పెట్టిన అక్రమకేసులు ఎత్తివేయాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ మానుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రైవేటీకరణ ఉద్యమం వెయ్యి రోజులు పూర్తిచేసుకున్నందున దానికి మద్దతుగా నిలిచిన మీడియాపై పెట్టిన అక్రమకేసులను నిరసిస్తూ బలిజిపేట మండల కేంద్రంలో ఎఫ్ఐఆర్ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ మానుకోవాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులపై పెట్టిన తప్పుడుకేసులు రద్దుచేయాలని, జైల్లో ఉన్న జర్నలిస్టులను బయటకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మన్మథరావు, వి.సత్యంనాయుడు, జి.జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో మెలకువలు పాటించాలి

- సివిల్ సప్లైస్ టెక్నికల్ సహాయకురాలు ప్రశాంతి



మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ సాంకేతిక సహాయకురాలు ప్రశాంతి

సీతానగరం: 2023 సీజన్‌లో మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణలో వ్యవసాయ సహాయకులు మెలకువలు పాటించాలని పార్వతీపురం మన్యం జిల్లా సివిల్‌సప్లైస్ టెక్నికల్ సహాయకురాలు ప్రశాంతి సూచించారు. ఈ మేరకు సోమవారం ఆమె మండలంలోని పెదభోగిలి రైతు భరోసా కేంద్రంలో ఏఓ ఎస్.అవినాష్ అధ్యక్షతన మండలంలోని ఆర్బీకేల వ్యవసాయ సహాయకులు ధాన్యం సేకరణలో తీసుకోవలసిన మెలకువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖ (సివిల్‌సప్లైస్) ఆర్బీకేలద్వారా సేకరించే ధాన్యం కొనుగోలుకు సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తల్లో భాగంగా సాధారణ రకం ధాన్యం క్వింటాకు రూ.2,183లు గ్రేడ్ 'ఎ'రకం రూ2,203 ధర అని చెప్పారు. అలాగే నాణ్యతా ప్రమాణాలుగా సేంద్రియవ్యర్థాలు-1 /శాతం, చెడిపోయిన, రంగుమారిన, మొలకెత్తి, పురుగుతిన్న పరిపక్వంకాని, ముడుచుకు పోయి వంకర తిరిగిన ధాన్యం 3/ శాతం ఉండాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాల్లో ముఖ్యంగా తేమశాతం 17/శాతం కంటే తక్కువ ఉండాలన్నారు. ఈ ఏడాది ఫార్మ్‌గేట్ వద్ద ధాన్యం కొనుగోలు జరుగుతుందని నాణ్యతా ప్రమాణాలు గుర్తించడానికి అవసరమైన పరికరాలు పోకర్ ఎనామిల్ ప్లేట్, జల్లెడ, తేమచూసే పరికరం, స్కూప్,టెస్టింగ్ కప్, పొట్టుతీసే పరికరం ఉపయోగాలపై టెక్నికల్ అసిస్టెంట్‌లకు వ్యవసాయ సహాయకులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు.

ఇంటింటి కుళాయి పనులు వేగవంతం చేయాలి



పైప్‌పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు

సీతానగరం: మండలంలోని అన్నిగ్రామాల్లో రూ.3 కోట్ల వ్యయంతో జరుగుతున్న ఇంటింటి కుళాయి పనులు వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మరిపివలసలో జరుగుతున్న ఇంటింటి కుళాయి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరిపివలసలో రూ.31 లక్షల వ్యయంతో 290 ట్యాప్‌లు ఏర్పాటుచేసి ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయడానికి జరుగుతున్న ప్రధాన పైప్‌లైన్, ట్యాప్‌ల ఏర్పాటు నాణ్యతా ప్రమాణాలకు లోబడి చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఆలస్యంగా పనులు ప్రారంభించినా నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు సరఫరా చేయనున్నామని తెలిపారు. అలాగే పెదంకలాంలో పూర్తయిన ఓవర్ హెడ్‌ట్యాంక్, ఇంటింటి కుళాయిల పనులతో ప్రజలకు ఓహెచ్ఆర్ ద్వారా తాగునీరు సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే కె. సీతారాంపురంలో ఓహెచ్ ట్యాంక్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్ పవన్‌కుమార్, ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ప్రజలలో నాడు.. ప్రజల కోసం నేడు..



సాలూరు : మామిడిపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

- ప్రజా సంకల్పయాత్రకు ఆరేళ్లు
- వాడవాడలా సంబరాలు



సాలూరు: పట్టణంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ప్రారంభమై ఆరేళ్లు పూర్తి కావడంతో పట్టణం,మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని వైఎస్సార్ విగ్రహంతో పాటు మండలంలోని మామిడిపల్లిలో గల వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ, సుదీర్ఘ పాదయాత్ర ద్వారా జగన్ మోహన్‌రెడ్డి పేదల కష్టాలను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలందరి కష్టాలు తీర్చి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని చెప్పారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత జగనన్నకు దక్కుతుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్ గిరి రఘు, కౌన్సిలర్లు, నాయకులు జర్జాపు సూరిబాబు, రాపాక మాధవరావు, సింగారపు ఈశ్వరరావు, పిరిడి రామకృష్ణ, మామిడిపల్లి సర్పంచ్ సువ్వాడ శశికళ, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.